సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం | 25 | జూన్ | 2023



అన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో అన్నదానానికి గోపరాజు శిరీష్, అలేఖ్య దంపతులు (హైదరాబాద్) శనివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో నిత్యాన్నదానానికి, నిత్యాభిషేకానికి చెరో రూ.50 వేల చొప్పున ఆర్.సంధ్య, కుటుంబ సభ్యులు శనివారం విరాళం సమర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం 31.0°/24.5°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	31.0	25.00
కాకినాడ	28.0	24.5
అమలాపురం	30.0	26.0

న్యూస్‌రీల్

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

ముమ్మిడివరం: స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల భవనాల్లో ఏర్పాటు చేస్తున్న ఈవీఎం గోదామును కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూలై మొదటి వారంలో బెంగళూరులోని భారత్ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బెల్) నుంచి 5 వేల వీవీ ప్యాట్‌లు రానున్నాయని చెప్పారు. తరువాత ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు వస్తాయన్నారు. వీటిని భద్రపరిచేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో ఈ గోడౌన్‌ను వీక్షించే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీర్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ'లో కొత్త కరిక్యులమ్

అమలాపురం రూరల్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలల్లోనూ సింగిల్ మేజర్ సబ్జెక్టుతో కొత్త కరిక్యులమ్ అమలు చేయనున్నారు. వర్సిటీ ప్రాంతీయ కేంద్రం డీన్ ప్రొఫెసర్ సురేష్‌వర్మ ఈ విషయం వెల్లడించారు. జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధన సిబ్బందితో స్థానిక ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం ఆయన సమావేశమై, కొత్త విధానంపై అవగాహన కల్పించారు. ఇప్పటి వరకూ డిగ్రీలో మూడు సబ్జెక్టుల ప్రధాన కాంబినేషన్ ఉండగా.. ఇకపై ఒక మేజర్ సబ్జెక్టు ప్రధానంగా కొనసాగుతుందని చెప్పారు. డిగ్రీలో బీఎస్సీ-ఎంపీసీ (మూడు సబ్జెక్టుల కాంబినేషన్) ఉండగా.. కొత్త విధానం ప్రకారం దాని స్థానంలో బీఎస్సీ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్స్ సైన్స్‌లలో ఒకటి మేజర్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విధానం అన్ని యూనివర్సిటీల్లోనూ అమలవుతోందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ కుమార్, కరస్పాండెంట్ డీఎస్‌ఎన్‌రాజు శాస్త్రి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ వి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామికి రూ.1.98 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారిని శనివారం 3,275 మంది భక్తులు దర్శించుకున్నారు. వారి గోవింద నామోచ్చారణతో ఆలయ ప్రాంగణం ప్రతిధ్వనించింది. పవిత్ర వైనతేయ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశారు. స్వామి వారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. తలనీలాలు సమర్పించారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.48 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలుగా రూ.50,478 కలిపి స్వామివారికి మొత్తం రూ.1,98,478 ఆదాయం సమకూరింది. 2,408 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారని ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి తెలిపారు.

వెంకన్న సన్నిధి.. భక్తజన పెన్నిధి



వాడపల్లిలో భక్తుల కోలాహలం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని శనివారం సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరించిన వారితో పాటు, ఇతర భక్తులు తరలివచ్చారు. వివిధ గ్రామాల నుంచి పలువురు భక్తులు కాలినడకన వాడపల్లి క్షేత్రానికి చేరుకున్నారు. భక్తుల కోసం ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాద విక్రయం, ఇతర విరాళాల రూపేణా స్వామి వారికి రూ.15,95,754 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



అయినవిల్లిలో చెండా మేళం కళాకారుల ప్రదర్శన

కోనసీమ వీధుల్లో.. కేరళ దరువు

మా ప్రదర్శన ప్రత్యేకం



వివిధ రకాల ఊరేగింపుల్లో మా ప్రదర్శన ప్రత్యేకంగా నిలుస్తోంది. వీక్షించేందుకు వచ్చే వారిలో ఎక్కువ మంది మా ప్రదర్శన తిలకిస్తారు. ఇటీవలి కాలంలో మా చెండా మేళానికి డిమాండ్ పెరుగుతోంది.

– కోటి, చెండా మేళం కళాకారుడు



అమలాపురం మెయిన్ రోడ్డులో మోత మోగిస్తున్న చెండా మేళం కళాకారులు



- చెండా మేళంతో అదరగొడుతున్న స్థానిక కళాకారులు
- త్రిశూర్‌లో ప్రత్యేకంగా శిక్షణ
- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శనలు

సండే స్పెషల్

సాక్షి, అమలాపురం/అయినవిల్లి: కేరళతో చాలా విషయాల్లో కోనసీమకు దగ్గర పోలికలుంటాయి. ప్రకృతి అందాలు.. కొబ్బరి చెట్లు.. పచ్చని చేలు.. విస్తారమైన సముద్ర తీరంతో రెండు ప్రాంతాలూ దాదాపు ఒకేలా అగుపిస్తాయి. కోనసీమను మినీ కేరళగా కూడా అభివర్ణిస్తారు. ఆ ప్రభావమో ఏమో కానీ అరుదైన వాయిద్య కళ కేరళ చెండా మేళానికి ఈ సీమలో ఘనమైన గుర్తింపు లభిస్తోంది. దేవాలయాల వద్ద జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలు, శుభకార్యాల సమయంలో నిర్వహించే ఊరేగింపుల్లో కేరళ చెండా మేళం అగ్రస్థానంలో నిలుస్తోంది. ఈ కళలో కేరళలో శిక్షణ పొందిన స్థానిక కళాకారులు తమ ప్రతిభా పాటవాలతో ఉమ్మడి రాష్ట్రంలో పలు ప్రదర్శనలు ఇస్తూ శభాష్ అని కితాబులందుకుంటున్నారు. కేరళ అనగానే కథాకళి, కొడియాట్టం, తెయ్యం వంటి కళారూపాలు గుర్తుకు వస్తాయి. అటువంటి వాటిలో చెండా మేళం ఒకటి. దీని ప్రదర్శనలో స్థూపాకార పెర్కషన్ వాయిద్యాన్ని వాయిస్తారు. దాని నుంచి వచ్చే లయబద్ధమైన శబ్దానికి అనుగుణంగా నృత్యం చేస్తూ వీరు చేసే ప్రదర్శన ఆకట్టుకుంటోంది.

బృందంలోని మహిళా కళాకారులు పెద్దపెద్ద చిడతలతో తాళం వేస్తారు. కేరళలో 300 సంవత్సరాలకు పైగా అత్యంత ప్రజాదరణ పొందిన కళారూపం చెండా మేళం. ఇందులో 30 నుంచి 100 మంది వరకూ సభ్యులుంటారు. కేరళలోని అన్ని పండగల్లో చెండా మేళం తప్పనిసరి. కేరళతో పాటు కర్ణాటక, తమిళనాడుల్లో దీనికి విశేష ఆదరణ ఉంది. సామాజిక మాధ్యమాలు విస్తృతమైన తరువాత దీనికి దేశవ్యాప్తంగా ఆదరణ వచ్చింది.

కేరళ కళాకారులకు దీటుగా..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా గడచిన ఒకటిన్నర దశాబ్దాలుగా ఈ కళా ప్రదర్శన జరుగుతోంది. తొలి రోజుల్లో కేరళ నుంచి వచ్చిన కళాకారులు దీనిని ప్రదర్శించేవారు. అయితే ఇది వ్యయప్రయాసలతో కూడుకొని ఉండేది. దీంతో అయినవిల్లి మండలం ముక్తేశ్వరానికి చెందిన నాయీ బ్రాహ్మణులు ఈ కళలో శిక్షణ పొంది, 30 మందితో బృందాన్ని తయారు చేశారు. స్థానికంగా ఉన్న ఎల్.గురునాథం తొలుత మంగళ వాయిద్యాలు వాయించేవారు. తరువాత తీన్‌మార్‌లోకి మారారు. వీటికన్నా కేరళ చెండాకు ఆదరణ ఉందని తెలుసుకుని ఈ బృందాన్ని తయారు చేశారు. తరువాత ముక్తేశ్వరంతోపాటు ఇదే మండలంలో అయినవిల్లి, విలస గ్రామాల్లో కూడా కేరళ చెండా బృందాలు తయారయ్యాయి. గురునాథం కేరళలోని త్రిశూర్‌లో ప్రముఖ గురువు రాజేష్ మాలా వద్ద శిక్షణ పొందారు. అనంతరం ఇక్కడకు వచ్చి, స్థానికులకు శిక్షణ ఇచ్చారు. అయితే మెరుగైన మేళంగా శిక్షణ ఇచ్చేందుకు ఏటా కొంతమందిని త్రిశూర్ పంపుతున్నారు.

త్వరలో కాంతారా ప్రదర్శన



మొదట తారసాలు, తరువాత తీన్‌మార్ వాయించే వాళ్లం. ఇప్పుడు కేరళ చెండా, తంబోళం మేళాలు ప్రదర్శిస్తున్నాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో వందల కొద్దీ ప్రదర్శనలు ఇచ్చాం. ఇటీవల విశాఖ జిల్లాలో కాంతారా కళను ప్రదర్శించాము. కాంతారాను త్వరలో పూర్తి స్థాయి ప్రదర్శనగా మారుస్తాం.

– ఎల్.గురునాథం, ముక్తేశ్వరం, అయినవిల్లి మండలం

ఉమ్మడి రాష్ట్రంలో ఆదరణ

కేరళ చెండా కళను ప్రదర్శించే కోనసీమ బృందాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మంచి ఆదరణ ఉంది. ఈ బృందాలు కేరళ సంప్రదాయ వస్త్రాలు ధరించి మరీ ప్రదర్శన ఇవ్వడం విశేషం. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు వంటి ప్రాంతాల్లో వీరు ప్రదర్శనలు ఇచ్చారు. సింహాచలం, అన్నవరం, అంతర్వేదితో పాటు హైదరాబాద్ మియాపూర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి తదితర ఆలయాల వద్ద వీరు ప్రదర్శన ఇచ్చారు. వీటితో పాటు పలు జిల్లాల్లో ఆలయాల ప్రారంభోత్సవం, రథోత్సవాలు, అమ్మవార్ల ఊరేగింపులు, తీర్థాలు, జాతర్లలో చెండా ప్రదర్శన తప్పనిసరిగా మారింది. ఇక ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థలు, కార్పొరేట్ విద్యా సంస్థల ప్రచార హోరు, పెళ్లి ఊరేగింపుల్లో కేరళ చెండా ప్రదర్శన ఉండాల్సిందే. చివరకు చిన్న పిల్లల పుట్టిన రోజులకు సైతం వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ప్రదర్శనకు దూరం, సమయాన్ని బట్టి రూ.30 వేల నుంచి రూ.70 వేల వరకూ వసూలు చేస్తున్నారు. కేరళలో చెండా మేళం తరహాలోనే తంబోళా మేళానికి కూడా ఆదరణ పెరుగుతోంది. దీంతో స్థానిక కళాకారులు ఈ కళను సైతం నేర్చుకుని రాణిస్తున్నారు.



కేరళ చెండా మేళం ప్రదర్శన



తంబోళం మేళం

పూచీకత్తు లేకుండా కౌలుదార్లకు రుణాలు

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- పైలట్ ప్రాజెక్టుపై సమీక్ష

అమలాపురం రూరల్: జిల్లాలో 2 వేల మంది కౌలు రైతులకు ఎటువంటి పూచీకత్తూ లేకుండా వ్యవసాయ, వృత్తిపరమైన రుణాలు ఇచ్చేందుకు పైలట్ ప్రాజెక్టు ద్వారా ప్రణాళికలు సిద్ధం చేశామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్టు ద్వారా ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలపై ఆయన కలెక్టరేట్‌లో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డీసీసీబీ ద్వారా ఈ పైలట్ ప్రాజెక్టు అమలు చేస్తున్నామన్నారు. పది మండలాల్లోని పది గ్రామాల్లో ఈ రుణాలు అందించేందుకు అర్హులను గుర్తించామని చెప్పారు. పొలం విస్తీర్ణం ఆధారంగా ఎటువంటి పూచీకత్తూ లేకుండా రూ.1,40,58,100 మేర రుణాలు ఇచ్చేందుకు ప్రతిపాదించామని తెలిపారు. ఐదు మండలాల్లో కౌలు రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి, గ్రూపు రుణాల కల్పనకు ప్రతిపాదించామన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ద్వారా కౌలుదార్లకు 12 శాతం వడ్డీతో పంట రుణాలు సకాలంలో అందించి, అదే సీజన్‌లో తిరిగి చెల్లించే విధంగా కార్యాచరణ సిద్ధం చేశామని వివరించారు. రుణాల రికవరీకి కూడా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు మాట్లాడుతూ, కౌలు రైతులకు ఉదారంగా పంట రుణాలివ్వాలని నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, తహసీల్దార్లు, బ్యాంకు నోడల్ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ ధ్యానచంద్ర తదితరులు

వివాదాలకు తావు లేకుండా భూముల రీసర్వే

ఎక్కడా భూ వివాదాలకు తావు లేకుండా సమగ్ర భూ రీ సర్వే నిర్వహించాలని సర్వే అధికారులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి తన క్యాంప్ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష రీ సర్వే రెండో దశ పురోగతి, ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణాల పురోగతి, జగనన్నకు చెబుదాం ఫిర్యాదుల పరిష్కార సరళిపై ఈ సందర్భంగా సమీక్షించారు. అనంతరం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, రీ సర్వే రెండో దశలో గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాల్యుయేషన్, డ్రోన్ ఫ్లయింగ్, ఓఆర్ఐ మ్యాపుల జనరేషన్ వంటి ప్రక్రియలు వేగంగా జరగాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీఓ కృష్ణకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 20 మంది ఎంపిక

కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు 70 అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 20 మంది ఎంపికయ్యారని వికాస జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందజేశారు.

చలపతిరావుకు జాతీయ ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న సీనియర్ శాస్త్రవేత్త చలపతిరావు

అంబాజీపేట: కొబ్బరిలో తెల్లదోమ నియంత్రణపై స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్ర కీటక విభాగాధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు సమర్పించిన పరిశోధన వ్యాసానికి జాతీయ స్థాయి ఉత్తమ అవార్డు లభించింది. ఆ కేంద్ర అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు శనివారం ఈ విషయం తెలిపారు. ఢిల్లీకి చెందిన ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌ఎస్‌ఈ) ఆధ్వర్యాన బెంగళూరులోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌లో ఈ నెల 22, 23, 24 తేదీల్లో జాతీయ స్థాయి సమావేశాలు జరిగాయి. వీటిలో డాక్టర్ చలపతిరావుతో పాటు దేశంలోని 25 రాష్ట్రాల నుంచి 700 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. తెల్లదోమ నివారణకు స్థానిక పరిశోధన కేంద్రంలో నిర్వహించిన జీవ నియంత్రణ ప్రయోగాలపై సమర్పించిన పత్రాలకు గాను డాక్టర్ ఆయనకు ఉత్తమ మౌఖిక ప్రజెంటేషన్ అవార్డు లభించింది. ఐఎస్‌ఎస్‌ఈ అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ గౌతమ్, యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ఉప కులపతి డాక్టర్ ఎస్‌వీ సురేషా చేతుల మీదుగా చలపతిరావు ఈ అవార్డు అందుకున్నారు.

రూ.16.80 లక్షల స్త్రీనిధి స్వాహా

- పేరూరు వీఓఏపై డ్వాక్రా మహిళల ఆరోపణలు
- రూ.9.60 లక్షలు తిరిగి చెల్లించేందుకు వీఓఏ అంగీకారం

అమలాపురం రూరల్: బండారులంకలో ఇటీవల స్త్రీనిధి రుణాల్లో అవినీతి బాగోతం మరువక ముందే పేరూరులో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితులు నిలదీయడంతో ఈ వ్యవహారం బయట పడింది. వివరాలివీ.. పేరూరు చింతపల్లివారిపాలెం, తొట్లపాలెం, చాకలిపాలెం పరిధిలోని 21 డ్వాక్రా సంఘాలకు స్త్రీనిధి బ్యాంక్ ద్వారా మూడేళ్ల కిందట రూ.27 లక్షలు పైగా రుణాలు ఇచ్చారు. నిబంధనల ప్రకారం రుణ వాయిదాలను తొలుత డ్వాక్రా సంఘాల ఖాతాలకు, అనంతరం స్త్రీనిధి అకౌంట్‌కు జమ చేయాలి. కానీ, దీనికి విరుద్ధంగా పేరూరు క్లస్టర్ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీఓఏ) కనకదుర్గ వ్యవహరించిందని సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆమె యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవా కేంద్రాన్ని కొంకాపల్లిలో నిర్వహిస్తోంది. తమ రుణ వాయిదాలను వీఓఏ కట్టించుకుని, నకిలీ రశీదులు ఇచ్చారని, కొంత మందికి అది కూడా ఇవ్వలేదని డ్వాక్రా సంఘాల సభ్యులు చెబుతున్నారు. బ్యాంకు పాస్ పుస్తకాలు, గ్రూప్ సభ్యుల రబ్బరు స్టాంపులు, వ్యక్తిగత పుస్తకాలను కూడా కనకదుర్గ తన వద్దనే ఉంచుకుని, సుమారు రూ.16.80 లక్షల మేర స్వాహా చేసిందని వారు ఆరోపిస్తున్నారు. అప్పట్లో కరోనా వ్యాప్తి ఉధృతంగా ఉంది. ఇదే అదునుగా ఆమె తమ సొమ్ములు స్వాహా చేసిందని అంటున్నారు.

ఇదిలా ఉండగా తీసుకున్న రుణాలకు గడువు ముగిసిపోవడంతో అప్పు తీరిపోయిందని సభ్యులు భావిస్తున్నారు. అయితే, ఇంకా బకాయిలు చెల్లించాలంటూ బ్యాంకు అధికారుల నుంచి ఒత్తిళ్లు రావడంతో డ్వాక్రా సంఘాల సభ్యులు ఆందోళనకు గురై, దీనిపై ఆరా తీశారు. దీంతో అసలు గుట్టు రట్టయ్యింది. ఈ నేపథ్యంలో పేరూరు గ్రామ పంచాయతీలో శనివారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో వీఓఏను బాధితులు నిలదీశారు. స్త్రీనిధి ఏజీఎం లక్ష్మీప్రసన్న, సర్పంచ్ దాసరి అరుణాడేవిడ్, ఎంపీటీసీ సభ్యుడు చొల్లంగి సుబ్బిరామ్ సమక్షంలో బాధితులు జరిగిన విషయాన్ని వివరించారు. వీఓఏ స్వాహా చేసిన తమ వాయిదాల సొమ్ము ఇప్పించాలని డిమాండ్ చేశారు. నిరుపేద మహిళలమైన తమ సొమ్ము దోచుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు వీఓఏను నిలదీశారు. ఈ నేపథ్యంలో నెల రోజుల్లోగా రూ.9.60 లక్షలు తిరిగి చెల్లిస్తానంటూ వీఓఏ లిఖిత పూర్వకంగా అధికారులకు తెలిపింది. తాను వాడుకున్న రుణాల సొమ్ములో క్లస్టర్ సీసీ లక్ష్మి పాత్ర కూడా ఉందని కనకదుర్గ ఆరోపించింది. స్త్రీనిధి ఏజీఎం లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ, రూ.16.80 లక్షల మేర అవితినీతి జరిగినట్టు గుర్తించామని చెప్పారు. మహిళా రుణాలు, పొదుపు సొమ్ముల్లో ఎంత మేర అవకతవకలు జరిగాయో బ్యాంకు అధికారులు ఆడిట్ చేయాల్సి ఉందని తెలిపారు. దీనిపై మరింత లోతుగా విచారణ చేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

కారు ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఆలమూరు: జొన్నాడ వద్ద 216ఏ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. నిడదవోలు మండలం కంసాలిపాలెనికి చెందిన కాపకాయల వెంకటేశ్వరరావు (47) కొంత కాలం నుంచి తన అత్తవారి ఊరు మూలస్థాన అగ్రహారంలో భార్యాబిడ్డలతో కలిసి ఉంటున్నాడు. వరి విత్తనాల కోసం మోటార్ సైకిల్‌పై జొన్నాడ వెళ్లి, శుక్రవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో తిరిగి వస్తున్నాడు. జొన్నాడ ఆంజనేయ స్వామి ఆలయం కూడలి వద్ద రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న కారు అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావును ఎన్‌హెచ్ అంబులెన్సులో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో డివైడర్‌ను ఢీకొని కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి సురక్షితంగా బయటపడ్డారు. ఎస్సై ఎస్.శివప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



విసరపు అబ్బాయి (పాత చిత్రం)

పిఠాపురం: పట్టణంలోని కత్తులగూడెం ప్రాంతానికి చెందిన శతాధిక వృద్ధుడు విసరపు అబ్బాయి అలియాస్ వెంకట్రావు (102) శనివారం మృతి చెందాడు. ఆయనకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఐదేళ్ల క్రితం మృతి చెందింది. చనిపోయేంత వరకూ ఆయన ఆరోగ్యంగా ఉన్నట్టు బంధువులు తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ కిరణ్ కుమార్



సదస్సులో పాల్గొన్న నిరుద్యోగులు

శిక్షణతోనే భవితకు నిశ్చైన

- సాధనతోనే విజయం
- ప్రణాళికతో చదివితేనే కొలువు • విద్యావేత్తల సూచన
- ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్
- సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ ఆధ్వర్యాన గ్రూప్–2 ఉద్యోగాల సాధనపై అవగాహన సదస్సు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చక్కని ప్రణాళికతో చదివితే కోరుకున్న కొలువు సులువుగా సాధించవచ్చని పలువురు విద్యావేత్తలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పెద్ద ఎత్తున గ్రూప్–2 పోస్టులు భర్తీ చేయనున్న నేపథ్యంలో 'సాక్షి' మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ (హైదరాబాద్) ఆధ్వర్యాన శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కాకినాడ దంటు కళాక్షేత్రంలో జరిగిన ఈ సదస్సుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రూప్–1, గ్రూప్–2 వంటి పోస్టులు వెయ్యికి పైగా భర్తీ చేసేందుకు ప్రభుత్వం త్వరలో చర్యలు తీసుకుంటుందని అధ్యాపకులు ఈ సందర్భంగా చెప్పారు. పరీక్ష విధానం, మారిన సిలబస్, విద్యార్థుల సన్నద్ధతపై అధ్యాపకులు డాక్టర్ కరీం (హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), ఎండీ పాషా (ఎకానమీ), బి.కృష్ణారెడ్డి (పాలిటీ) అవగాహన కల్పించారు. తొలుత ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ మొండెం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన లెజండరీ ఫ్యాకల్టీలతో కరోనా సమయంలో తాము ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించామని చెప్పారు. తమ సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో 25 వేల మంది నిరుద్యోగులు శిక్షణ పొందారని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వేలాది మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. అనంతరం సదస్సుకు హాజరైన వారికి పరీక్ష నిర్వహించి స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో నాయుడు స్టడీ సర్కిల్ నాయుడు, 'సాక్షి' బ్యూరో చీఫ్ ఎల్.శ్రీనివాసరావు, యాడ్స్ మేనేజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోటీ పరీక్షలో మొదటి స్థానం విజేత వరప్రసాద్‌కు స్కాలర్‌షిప్ అందిస్తున్న అతిథులు

గ్రూప్–2కు అత్యుత్తమ శిక్షణ



పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారి కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఆర్‌సీ ఎగ్జామ్స్ ద్వారా రాష్ట్రంలోనే అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నాం. మా సంస్థలో అత్యుత్తమ ఫ్యాకల్టీలు బోధిస్తున్నారు. ఈ నెలలో ఏపీ గ్రూప్–2 బ్యాచ్‌కు అడ్మిషన్లు ప్రారంభించాం. హైదరాబాద్ రాలేని గృహిణులు, ప్రైవేటు ఉద్యోగులకు మొబైల్ యాప్ ద్వారా తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో శిక్షణ ఇస్తున్నాం. వివరాలకు 89850 93399, 89850 94499 నంబర్లలో సంప్రదించవచ్చు.

– మొండెం కిరణ్‌కుమార్, చైర్మన్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ, హైదరాబాద్

భవితకు భరోసా



నేను సివిల్స్ రాసి ఇంటర్వ్యూ వరకూ వెళ్లాను. గ్రూప్–1 ఉద్యోగం సాధించి రిజిస్ట్రేషన్ శాఖలో పని చేశాను. టీచింగ్‌పై మక్కువతో మూడు దశాబ్దాలుగా హిస్టరీ బోధకుడిగా పని చేస్తున్నాను. తెలంగాణ, ఢిల్లీ, బెంగళూరు, రాజస్థాన్ తదతర రాష్ట్రాల్లో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చాను. కోవిడ్ సమయంలో పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాం. ఆర్‌సీ ఎగ్జామ్స్ పేరుతో వేలాది వీడియోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం.

– డాక్టర్ ఎం.అబ్దుల్ కరీం, హిస్టరీ ఫ్యాకల్టీ

ఆత్మ విశ్వాసం పెంచింది



గ్రూప్–2 పోటీ పరీక్షల్లో విజయ సాధనకు అభ్యర్థులు చేయాల్సిన కృషి, పాటించాల్సిన మెళకువలపై నిష్ణాతులైన ఫ్యాకల్టీలు చక్కగా మార్గనిర్దేశం చేశారు. ఇది మా ఆత్మ విశ్వాసాన్ని పెంచింది. పోటీ పరీక్షలకు తొలిసారిగా హాజరయ్యే వారు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించవచ్చనే అంశాలను అర్థమయ్యేలా చక్కగా వివరించారు.

– డి.నాగకృష్ణ, బీకాం

'సాక్షి'కి కృతజ్ఞతలు



గ్రూప్–2 ఉద్యోగం సాధించాలంటే ఎలాంటి వ్యూహాలు అనుసరించాలో ఈ సదస్సు ద్వారా అవగతమైంది. ఏయే సబ్జెక్టులపై ఎలా ఫోకస్ చేయాలనే అంశాలపై స్పష్టత వచ్చింది. ప్రిలిమినరీ, మెయిన్స్ రెండింటికీ ఒకే దఫా ఎలా సన్నద్ధం కావాలో అంచనా ఏర్పడింది. ఈ సదస్సు ఏర్పాటు చేసిన 'సాక్షి' మీడియాకు కృతజ్ఞతలు.

– కె.జ్ఞానానాగేశ్వరి, కాకినాడ

విభిన్న ఆలోచనలతో సన్నద్ధం కావాలి



పోటీ పరీక్షలకు లక్షల మంది దరఖాస్తు చేస్తారు. వీరిలో తక్కువ మందికి మాత్రమే గ్రూప్ సిలబస్‌పై అవగాహన ఉంటుంది. ఇందులో అంశాల పరిధిని చాలా విస్తృతంగా చదవాలి. ప్రశ్నల సరళిలో చాలా మార్పులు చేశారు. ప్రతి అంశంపై చాలా లోతుగా ఆలోచించాలి.

– బి.కృష్ణారెడ్డి, పాలిటీ ఫ్యాకల్టీ

సైన్స్ అండ్ టెక్నాలజీ కీలకం



ఏపీపీఎస్సీ మూడు నెలల క్రితమే గ్రూప్స్ సిలబస్‌లో మార్పులు చేసింది. ఇందులో సైన్స్ అండ్ టెక్నాలజీ అనేది కీలకం. దీనిని కరెంట్ అఫైర్స్‌లో భాగంగా పరిగణించాలి. ఇస్రో పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలు, ఉపగ్రహ ప్రయోగాల వంటి వాటిపై దృష్టి పెట్టాలి. ఇందులో ఏయే టాపిక్ నుంచి ఎన్ని మార్కులు వస్తాయో కూడా అవగాహన ఉండాలి.

– సి.హరికృష్ణ, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ

సమయం ప్రధానం



పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు చక్కని ప్రణాళిక వేసుకుంటే విజయం సాధ్యమవుతుంది. పోటీ పరీక్షల్లో సమయం చాలా ప్రధానం. ఎకానమీపై గతంతో పాటు వర్తమాన అంశాలను కూడా గూగుల్‌లో ఎప్పటికప్పుడు చూస్తుండాలి. నోటిఫికేషన్ కోసం ఎదురు చూడకుండా నిరంతరం శ్రమించాలి. నోటిఫికేషన్ వచ్చాక కేవలం క్లిష్టమైన అంశాలపై దృష్టి పెట్టాలి.

– ఎండీ పాషా, ఎకానమీ ఫ్యాకల్టీ

స్ఫూర్తి కలిగించారు



అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు స్ఫూర్తిని కలిగించారు. ప్రణాళికాబద్ధమైన సాధనతోనే విజయం సాధ్యమవుతుందని ఉదాహరణలతో చెప్పిన తీరు అద్భుతం. గ్రూప్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఇది మంచి వరం.

– ఎస్.సూర్య, బీఎస్సీ

సాధనకు దిక్సూచి



ఉన్నత కొలువులు సాధించేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ అవగాహన సదస్సు దిక్సూచిలా ఉపకరిస్తుంది. ఇలాంటి కార్యక్రమాలు 'సాక్షి' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి, నిరుద్యోగుల అభ్యున్నతికి దోహదపడాలి.

– టి.సంతోషి, బీఏ

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ.. 10 మందికి స్వల్ప గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన ఆర్టీసీ బస్సు

తాళ్లరేవు: కోరంగి పాత అయ్యప్పస్వామి ఆలయం సమీపాన 216 జాతీయ రహదారిపై అమలాపురం డిపోకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు శనివారం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బస్సులలో ప్రయాణిస్తున్న సుమారు 10 మంది స్వల్పంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన తాళ్లరేవు సామాజిక ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేసి పంపించివేశారు. అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని, కోరింగ ఎస్సై పి.శ్రీనివాస కుమార్‌తో చర్చించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో ఎటువంటి కేసూ నమోదు చేయలేదని ఎస్సై తెలిపారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం

- 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు
- ముగిసిన రీజినల్ స్పోర్ట్స్‌మీట్

రాజానగరం: చదువుతో పాటు క్రీడలకు కూడా ఆదికవి నన్నయ యూనివర్సిటీ తగిన ప్రాధాన్యం ఇస్తూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. వర్సిటీలో రెండు రోజుల పాటు జరిగిన గోదావరి క్లస్టర్ అంతర్ విశ్వవిదాలయాల రీజినల్ స్పోర్ట్స్‌మీట్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో జేఎన్‌టీయూకే ఉప కులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజుతో కలిసి 'నన్నయ' వీసీ పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. క్రీడాస్ఫూర్తితో పయనిస్తూ ఎంచుకున్న లక్ష్యాలను సాధించే దిశగా ముందంజ వేయాలని సూచించారు. స్టేడియంలో రూ.8.50 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో స్విమ్మింగ్‌పూల్, ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. జేఎన్‌టీయూకే వీసీ ఆచార్య ప్రసాదరాజు మాట్లాడుతూ, క్రీడలు శరీర దారుఢ్యానికే కాకుండా మేధోసంపత్తి వృద్ధికి తోడ్పడతాయని అన్నారు. తొలుత విజేతలకు ఇద్దరు వీసీలూ బహుమతులు అందజేశారు.

వీరే విజేతలు

బాస్కెట్‌బాల్ మహిళల విభాగంలో 'నన్నయ', పురుషుల విభాగంలో జేఎన్‌టీయూకే విజేతలుగా నిలిచాయి. కబడ్డీ పురుషుల విభాగంలో జేఎన్‌టీయూకే, మహిళల విభాగంలో 'నన్నయ', వాలీబాల్ (పురుషులు, స్త్రీ విభాగాలు) 'నన్నయ', చెస్ మెన్స్ విభాగంలో జేఎన్‌టీయూకే, వుమెన్స్ విభాగంలో 'నన్నయ' విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ సభ్యుడు డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ఆచార్య కె.రమణేశ్వరి, నన్నయ, జేఎన్‌టీయూకే క్రీడా కార్యదర్శులు బి.రామ్‌గోపాల్, జి.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న వీసీలు ఆచార్య పద్మరాజు, ఆచార్య ప్రసాదరాజు